
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం, 16 నవంబరు 2024



లోపలి పేజీల్లో...
చేపల పెంపకానికి ప్రభుత్వం చేయూత 6
బ్రష్ కట్టర్‌తో వరికోత
అయ్యప్ప భక్తులకు ఆర్టీసీ బస్సులు 7
ముగిసిన ఒంగోలు జాతి ఎడ్ల పోటీలు
మధిరలో బాలోత్సవ్ ప్రారంభం 7





భద్రాచలంలో గోదావరికి హారతి దృశ్యం



ఖమ్మం గుంటు మల్లేశ్వరస్వామి ఆలయంలో...



పూజలందుకున్న కుసుమంచి గణపేశ్వరుడు

దేదీప్యమానం.. కార్తీక వైభవం...

- పౌర్ణమి వేళ పోటెత్తిన ఆలయాలు
- మార్మోగిన హర నామస్మరణ
- దీపాలు వెలిగించి, వత్తులు కాల్చిన భక్తులు
- భద్రాచలంలో గోదావరిలో పుణ్యస్నానాలు

ఖమ్మం సాంస్కృతికం/భద్రాచలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేళ భక్తిభావం వెల్లివిరిసింది. ప్రత్యేక పూజలతో ఆలయాలు రద్దీగా మారాయి. సామూహికంగా కార్తీక దీపాలను వెలిగించడంతో ఆలయాలు కొత్త కాంతితో కళకళలాడాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఖమ్మం నగరంలోని ప్రాచీన గుంటు మల్లేశ్వరస్వామి ఆలయం, సుగ్గలవారి తోట శివాలయం, బ్రాహ్మణ బజార్ శివాలయం, పోలీస్ లైన్ శివపంచాయతనం, తదితర ఆలయాలతోపాటు జిల్లాలోని కూసుమంచి, నీలాద్రి ఆలయం, వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలోని శివాలయం తదితర శైవక్షేత్రాలు హరనామస్మరణతో మార్మోగాయి.. శివాలయాలతోపాటు అందుబాటులో ఉన్న నదీ వనరుల వద్ద కార్తీక దీపాలను వెలిగించేందుకు భక్తులు ప్రాముఖ్యతనిచ్చారు. ఖమ్మంలోని మున్నేరు తీరంతోపాటు జిల్లావ్యాప్తంగా ఉన్న నదులు, వాగులు, ఏర్ల ప్రాంతంలోని వారు జలవనరుల్లో స్నానాలు ఆచరించి ప్రమిదలను వెలిగించారు. అరటి బోదెలు, ఉసిరి కాయలపైన, పిండి ముద్దల్లో, మట్టి ప్రమిదల్లో 365 వత్తులను వేసి దీపాలను వెలిగించారు. ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పౌర్ణమి నాడు హరినామ స్మరణ చేస్తే పుణ్యం లభిస్తుందన్న నమ్మకంతో వెంకటేశ్వర, నరసింహ స్వామి తదితర వైష్ణవ ఆలయాల్లో పూజలు చేశారు.

భద్రగిరిలో కార్తీక సందడి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలం కార్తీక పౌర్ణమి శోభను సంతరించుకుంది. శుక్రవారం వేకువజాము నుంచే భక్తులు భద్రాద్రిలోని పవిత్ర గోదావరి స్నానఘట్టాల వద్దకు చేరుకుని పుణ్యస్నానాలను ఆచరించారు. ఈ సమయంలో సంకల్పం, సూర్య నమస్కారం, (మిగతా 6వ పేజీలో)

ఐక్యతతోనే హక్కుల సాధన

- సమస్యలపై మాలలు కలిసికట్టుగా పోరాడాలి
- ఏ కార్యక్రమం చేపట్టినా అండగా నిలుస్తాం
- డిసెంబరు 1న 'చలో హైదరాబాద్'
- పెద్దఎత్తున తరలివచ్చి మాలల శక్తిని చాటాలి
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, కేఆర్ నాగరాజు
- మంద కృష్ణ దుష్ప్రచారం తగదు: మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య



మాలల 'చలో హైదరాబాద్' కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు, మాల ఉద్యోగ సంఘం నేతలు

ఖమ్మం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాలలు ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకోగలరని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. ఖమ్మంలోని ఈఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సమితి, మాల ఉద్యోగుల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ మాలల పోరాటాలకు తమ మద్దతు ఉంటుందన్నారు. మాలల అస్తిత్వాన్ని బలహీన పరిచేందుకు కుట్రలు జరుగుతున్నాయని, ఆయా శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మాలలు ఎవరికీ భయపడాల్సిన పనిలేదని, ఎటువంటి కార్యక్రమం నిర్వహించినా.. తాము సహకారం అందిస్తామన్నారు. మాలల శక్తిని నిరూపించుకునేందుకు డిసెంబరు 1న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమంలో మాలసామాజిక వర్గాలు, ఉద్యోగులు పెద్దఎత్తున హాజరుకావాలని ఎమ్మెల్యేలు వివేక్, నాగరాజు కోరారు. మాలలు వేర్వేరు సంఘాలు ఏర్పాటు చేయకుండా (మిగతా 6వ పేజీలో)



ఖమ్మం మెడికల్ కళాశాల నమూనా

మెడికల్ కళ..

వైద్య కళాశాలకు మహర్దశ

- రూ.130 కోట్లతో నూతన భవన సముదాయం నిర్మాణం
- రఘునాథపాలెం సమీపంలో 35.06 ఎకరాల్లో పనులు షురూ
- ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో చురుగ్గా సాగుతున్న నిర్మాణపనులు
- అందుబాటులోకి రానున్న 3.81,676 చ.అ. విస్తీర్ణం
- వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యం

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పేదలకు వైద్య సేవలు అందించడంలో ఖమ్మం జిల్లా ఆస్పత్రి పెద్ద దిక్కుగా నిలుస్తోంది. 520పడకలతో ఈ ఆస్పత్రి అత్యాధునిక వైద్యసేవలు అందిస్తోంది. ఈ క్రమంలో ఆస్పత్రికి అనుసంధానంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రభుత్వం రెండేళ్ల క్రితం మంజూరు చేసింది. అయితే ఖమ్మం నగరంలోనే మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలని నాటి ప్రభుత్వం భావించగా, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భవిష్యత్తు తరాలు, అవసరాలను దృష్టిలో ఉంచుకుని రఘునాథపాలెం సమీపంలో 35.06ఎకరాల సువిశాల స్థలంలో నిర్మించాలని సూచించారు. ఈ నేపథ్యంలో అక్కడ రూ.130 కోట్లతో అన్ని హంగులతో జిల్లా మెడికల్ కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గత ఆగస్టులో ఈ పనులను ప్రారంభించారు. మూడు నెలల్లో రూ.3కోట్ల విలువైన పనులను పూర్తి చేయగలిగారు.

రూ.130 కోట్లతో....

వాస్తవానికి ఖమ్మం మెడికల్ కళాశాలకు రూ.166కోట్ల నిధులు మంజూరయ్యాయి. వీటితో మెడికల్ కళాశాల భవనాన్ని 3,81,676 చదరపు అడుగుల విస్తీర్ణంతో మూడు బ్లాకులతో గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి మూడు అంతస్థులను నిర్మిస్తున్నారు. బాలికల హాస్టల్ కోసం (మిగతా 6వ పేజీలో)



చురుగ్గా జరుగుతున్న నిర్మాణ పనులు

బిర్సాముండాను ఆదర్శంగా తీసుకోవాలి

- 150వ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యేలు, కలెక్టర్ 6



కార్పొరేటర్ ఔదార్యం

- తెలంగాణ ఉద్యమకారుడికి త్రిచక్ర వాహనం
- రూ.లక్షా 30వేలతో ప్రత్యేకంగా తయారు చేయించిన రాపర్తి శరత్‌కుమార్
- మంత్రి తుమ్మల జన్మదిన వేడుకల్లో పంపిణీ 6



మక్కలు విత్తే చక్రాల మిషన్

- కూలీల కొరతకు సీడ్ రోలర్‌తో చెక్
- మక్కలు విత్తేందుకు సులభపద్ధతి 6



ఉందిలే మంచి కాలం..

- అమరావతి రైల్వేలైన్‌తో మారనున్న ఎర్రుపాలెం రూపురేఖలు
- భవిష్యత్తులో రైల్వే జంక్షన్‌గా మారే అవకాశం
- భూసేకరణకు నోటిఫికేషన్ జారీ
- ఎర్రుపాలెం, కేశిరెడ్డిపల్లి గ్రామాల్లో 24.01ఎకరాల గుర్తింపు
- తెలంగాణ, ఏపీ సరిహద్దుల్లో ఉండటంతో పెరిగిన ప్రాధాన్యం
- ఇప్పటికే భూములు కొనుగోలు చేసిన ఏపీ వాసులు
- పెరగనున్న రవాణా, వ్యాపార కార్యకలాపాలు

ఎర్రుపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న ఎర్రుపాలెం ప్రాంతానికి మహర్దశ పట్టబోతోంది. ఏపీ రాజధాని అమరావతికి నిర్మిస్తున్న కొత్త రైల్వేలైన్‌ను ప్రస్తుత రైల్వే మార్గానికి ఎర్రుపాలెం వద్ద అనుసంధానిస్తున్నారు. దీంతో ఎర్రుపాలెంకు ఒక్కసారిగా ప్రాధాన్యం పెరిగిపోయింది. రూ.2245 కోట్లతో 57 కి.మీ. మేర అమరావతి రాజధానికి కొత్త రైల్వేలైన్ ఏర్పాటు కానుంది. ఈ కొత్త రైల్వేలైన్ అమరావతి నుంచి హైదరాబాద్, చెన్నై, కోల్‌కతాకు నేరుగా అనుసంధానం చేస్తూ నిర్మాణం జరగనుంది. తెలంగాణలో ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం తర్వాత ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల కొత్తపేట, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పురావురులో నూతన స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ రైల్వేలైన్ ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా గుంటూరు జిల్లా నంబూరు వరకు 37 కి.మీ. దూరం ఉంటుంది. పెదకూరపాడు, సత్తెనపల్లి మార్గాలనూ కలిపితే 57 కి.మీ.ఉంటుంది.



కృపయా ధ్యాన్ దే...

భూ సేకరణతో పెరిగిన వేగం

ఎర్రుపాలెం నుంచి అమరాతి మీదుగా నంబూరు వరకు 57 కి.మీ. రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో పనులు వేగంగా పట్టాలెక్కనున్నాయి. దీనికి అవసరమైన భూ సేకరణ చేసేందుకు ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుగా గుర్తిస్తూ జూన్‌లో రైల్వేశాఖ గెజిట్ ప్రచురించింది. తాజాగా కేంద్రం ఆమోదంతో ఓవైపు భూ సేకరణ ఆరంభించడంతో పాటు మరోవైపు టెండర్లు పలిచి పనులు మొదలుపెట్టేందుకు వీలు కలిగినట్లయింది. ఈ లైన్‌కు ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు ఖమ్మం జిల్లాల పరిధిలో దాదాపు 450 హెక్టార్ల భూసేకరణ చేయనున్నారు.

కాగా, ఎర్రుపాలెం మండలంలో రెండు గ్రామాల్లో భూసేకరణరే కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. ఎర్రుపాలెం మండలంలోని ఎర్రుపాలెం, కేశిరెడ్డిపల్లి గ్రామాల్లో 24.01 ఎకరాల భూమిని సేకరించాలని (మిగతా 6వ పేజీలో)

అండర్-14 అథ్లెటిక్స్ ప్రారంభం

- ఉమ్మడి 10జిల్లాల నుంచి 350మంది క్రీడాకారులు
- తొలిరోజు మూడు విభాగాల్లో పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-14 బాలుర, బాలికల రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం నగరంలో ప్రారంభమయ్యాయి. స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ పోటీలను డీఈవో సోమశేఖరశర్మ, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మూడు రోజులపాటు జరగనున్న ఈ పోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి 10జిల్లాల నుంచి సుమారు 350మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. తొలిరోజు 600మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు.

కాగా, ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను త్వరలో జాతీయస్థాయికి ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సారంగపాణి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ ప్రసాద్, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి, ప్రముఖ వైద్యుడు కూరపాటి ప్రదీప్‌కుమార్, హార్వెస్ట్ విద్యాసంస్థల అధినేత రవిమారుత్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షఫీక్, అథ్లెటిక్స్ కోచ్ గౌస్ తదితరులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీలు ఆదివారం ముగుస్తాయి.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఈవో, డీవైఎస్‌వో

తొలిరోజు విజేతలు వీరే...

బాలుర 600 మీటర్ల పరుగు పోటీలో కె.జాకేష్ (ఆదిలాబాద్) ప్రథమ, కె.లవ్‌లిత్ (వరంగల్) ద్వితీయ, ఎం.చరణ్(వరంగల్) తృతీయ స్థానాల్లో నిలిచారు.

బాలికల 600మీటర్ల పరుగు పోటీలో ఎం.రాజేశ్వరి(వరంగల్) ప్రథమ, సమీరా(కరీంనగర్) ద్వితీయ, టి.పల్లవి(రంగారెడ్డి) తృతీయ స్థానాల్లో నిలిచారు.

బాలికల లాంగ్‌జంప్‌లో అన్విత(రంగారెడ్డి) ప్రథమ, శృతిహాసన్(ఖమ్మం) ద్వితీయ, ధాన్యశ్రీ(హైదరాబాద్) తృతీయ స్థానాల్లో నిలిచారు.

బాలుర షాట్‌పుట్ విభాగంలో సాత్విక్ (ఆదిలాబాద్) ప్రథమ, నరేష్ (ఖమ్మం) ద్వితీయ, వంశీ (మహబూబ్‌నగర్) తృతీయ స్థానాల్లో నిలిచారు.

మక్కలు విత్తే.. చక్రాల మిషన్...



సీడ్ రోలర్‌తో విత్తిన మొక్కజొన్న



- కూలీల కొరతను తీరుస్తున్న సీడ్ రోలర్
- మొక్కజొన్న విత్తేందుకు సులభ పద్ధతి

చింతకాని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిత్యం పెరుగుతున్న కూలీల కొరత, కూలీ ఖర్చులు, పంట పెట్టుబడులతో రైతాంగం వ్యవసాయానికి దూరమవుతోంది. ప్రస్తుత జీవన విధానంలో రైతు శ్రమని వృథా చేయకుండా సులభ వ్యవసాయానికి అలవాటు పడుతున్నాడు. చింతకాని మండల వ్యాప్తంగా ప్రతి ఏటా యాసంగిలో రైతులు వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేపడుతారు. నవంబరు నెలలో పత్తి తీతలు, వరి కోతలు అధికంగా ఉన్న నేపథ్యంలో మొక్కజొన్న విత్తేందుకు కూలీలు లభించకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. అందులో భాగంగా మొక్కజొన్న విత్తేందుకు సీడ్ రోలర్‌ను రైతులు వినియోగిస్తున్నారు. మొక్కజొన్న విత్తేందుకు ఎకరాకు కూలీల ఖర్చు రూ.2000 అవుతుండగా, ఎప్పటికి ఉపయోగపడుతుందనే రైతులు రూ.6 వేలకు సీడ్ రోలర్ కొనుగోలు చేసి ఉపయోగిస్తున్నారు.

రోజుకు రెండు ఎకరాలు విత్తుకోవచ్చు

మందా గోపాల్‌రావు (మొక్కజొన్న రైతు)



మొక్కజొన్న విత్తేందుకు కూలీలు ఖర్చు అధికంగా ఉందని మొక్కజొన్న సీడ్ రోలర్‌ను కొనుగోలు చేశా. ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేస్తున్న. మొక్కజొన్న విత్తేందుకు కూలీలు ఎకరాకు రూ.2వేలు అడిగారు. ఐదెకరాలకు రూ.10వేలు ఖర్చు అవుతుండటంతో, శాశ్వతంగా ఉపయోగపడుతుందని సీడ్ రోలర్‌ను రూ.8వేలకు కొనుగోలు చేశా. మొక్కజొన్న విత్తేందుకు ఇది సులభ పద్ధతి.

సీడ్ రోలర్‌ను కిరాయికు ఇస్తున్నా..

పెద్ది మహేష్ (మొక్కజొన్న రైతు)



మొక్కజొన్న విత్తేందుకు గతేడాది సీడ్ రోలర్‌ను కొనుగోలు చేశా. నాకున్న పొలంతోపాటు మరో 8 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న. సీడ్ రోలర్‌తో మొక్కజొన్న విత్తా. నాకు అవసరం లేని సమయంలో ఇతర రైతులకు కిరాయికు ఇస్తున్న. ఎకరాకు రూ.500 కిరాయి లభిస్తుంది. ఇప్పటివరకు సీడ్ రోలర్ ద్వారా రూ.20వేలు ఆదాయం వచ్చింది.



మాట్లాడుతున్న ఏఐపీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

వ్యవసాయ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

- పనిలేని సమయంలో నెలకు రూ.2,016లు ఇవ్వాలి
- ఏఐపీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

ఖమ్మం సంక్షేమవిభాగం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో 60శాతం ప్రజలు వ్యవసాయరంగంపై ఆధారపడి ఉన్నారని, వారిలో 80శాతం వరకు సన్న, చిన్నకారు రైతులు, కూలీలే ఉన్నారని, కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు వ్యవసాయ కార్మికులకు పనిలేని సమయంలో నెలకు రూ.2,016 పింఛన్ రూపంలో ప్రతి నెల ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎస్) రాష్ట్ర కార్యదర్శి వీ రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడెకరాల భూమి కలిగిన రైతుల్ని కూడా వ్యవసాయ కార్మికులుగానే గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇళ్లు లేని వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కోరారు. వ్యవసాయ కార్మికుల సమస్యలపై ఈనెల 20నుంచి 25 వరకు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించి 30న తహసీల్దారు కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. నాయకులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు, రేపాకుల శివలింగం, బందెల వెంకయ్య, తిమ్మిడి హనుమంతరావు, కంకణాల అర్జున్‌రావు, బీరెల్లి లాజర్, పోమనపల్లి వెంకటేశ్వర్లు, రెంటాల యాదగిరి, ఈర్ల వెంకటఅప్పారావు, ఆవుల మంగతాయి, కూరాకుల నర్సయ్య పాల్గొన్నారు.

చేపల పెంపకానికి ప్రభుత్వం చేయూత

- జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్
- సిరిసిల్ల జిల్లా ఔత్సాహికులకు ముగిసిన శిక్షణ



శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్

కూసుమంచి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):చేపల పెంపకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని ఖమ్మం జిల్లా మత్స్యశాఖ అధికారి ఎం.శివప్రసాద్ తెలిపారు. పాలేరులోని మత్స్యపరిశోధనా కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఆర్థిక సహకారంతో సిరిసిల్ల జిల్లా సహకార సంఘాలకు చెందిన 22మంది ఔత్సాహికులకు మూడురోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ చెరువుల తవ్వకానికి, చేపల పెంపకానికి సబ్సిడీ అవకాశం కల్పిస్తూ నీలివిప్లవం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీనియర్ శాస్త్రవేత్త శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణలో చేపపిల్లల ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉందని, హ్యాచరీలు నిర్మిస్తే ఇతర రాష్ట్రాల నుంచి చేపపిల్లలను దిగుమతి చేసుకోవాల్సిన అవసరంలేదని తెలిపారు. అనంతరం మత్స్యశాస్త్రవేత్త రవీందర్, పూర్వ సీనియర్ శాస్త్రవేత్త విద్యాసాగర్ మాట్లాడారు.

పెద్ద యంత్రాలు, కూలీల ఖర్చులు భరించలేక కొందరు చిన్న, సన్నకారు రైతులు నూతన పద్ధతులు అవలంభించి తక్కువ ఖర్చుతో పంటలు సాగుచేస్తున్నారు. ఇప్పటికే దుక్కులకు చిన్న ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు ఉపయోగిస్తుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం పోకలగూడెం గ్రామానికి చెందిన రైతు జంపుల వెంకటేశ్వర్లు అనే యువ రైతు వరి కోతకు బ్రష్ కట్టర్ అనే యంత్రాన్ని వినియోగిస్తున్నాడు. దీని సహాయంతో తన రెండున్నర ఎకరాల పొలంలో వరిని కోశాడు. ఈ బ్రష్ కట్టర్‌తో రోజుకు ఎకరం వరి కోయవచ్చని, ఎకరానికి రూ.500 పెట్రోలు ఖర్చవుతుందని తెలిపాడు.



బ్రష్‌కట్టర్‌తో వరికోత

- ఎకరానికి రూ.500 ఖర్చు
- భద్రాద్రి జిల్లా పోకలగూడెంలో ఓ యువరైతు వినూత్న ప్రయత్నం

చంద్రుగొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బ్రష్ కట్టర్‌తో కటింగ్ అనంతరం వరి పనలు ఎండిన తరువాత కుటుంబసభ్యుల సహాయంతో వాటిని పరదాలపై వేసి ట్రాక్టర్‌తో తొక్కించి నూర్పిడి చేయించి ధాన్యాన్ని ఇంటికి తరలిస్తామని తెలిపాడు. ఈ విధంగా చేయటం వల్ల రెండున్నర ఎకరాలకు రూ.6వేల నుంచి 7వేలు మాత్రమే ఖర్చు అవుతుందని, అదే యంత్రాలతో చేయిస్తే రెండున్నర ఎకరాలకు రూ.12వేల నుంచి రూ.13వేలు, కూలీలతో చేయిస్తే రూ.25వేలు ఖర్చు అవుతుందని తెలిపాడు.

పశుగ్రాసానికి ఢోకా ఉండదు

యంత్రంతో వరి కోస్తే గడ్డి భూమిపై చిన్న ముక్కలుగా పడుతుందని, దాన్ని యంత్రంతో కట్టలు కట్టించడానికి రూ.2 వేలు ఖర్చు చేయాల్సి ఉంటుందని తెలిపాడు. ఇంత చేసినా రైతు ఇంటికి చేరే పశుగ్రాసం నామమాత్రంగానే ఉందని, అదే రూ.10 వేల విలుగల బ్రష్ కట్టర్‌తో కోస్తే ఎటువంటి ఖర్చు లేకుండా పూర్తిస్థాయిలో గడ్డి చేతికి వస్తుందన్నాడు. ఒకవేళ విక్రయించినా ఎకరం పొలంలోని గడ్డికి రూ.10 వేలు వస్తుందని, తన రెండున్నర ఎకరాల్లోని వరి గడ్డికి రూ.25వేల వరకు ఆదాయం వస్తుందని సదరు రైతు తెలిపాడు.

ఖర్చులు తగ్గించుకుంటేనే నిలబతాం

చిన్న, సన్నకారు రైతులు కొత్త పద్ధతులు పాటిస్తూ, కుటుంబ సభ్యులతో కలిసి సాగు పనులు చేస్తేనే వ్యవసాయంలో నిలబడగలుగుతామని రైతు వెంకటేశ్వర్లు తెలిపాడు. అసలే ఎరువులు, పురుగుమందుల వాడకం భారంగా మారిందని, దీనికితోడు ప్రతి పనికి కూలీలు, కిరాయి యంత్రాలను వినియోగిస్తే రైతుకు నష్టాలే మిగులుతాయన్నాడు. రకరకాల పద్ధతుల్లో భూమి సారవంతం చేసుకొని, ఎరువులు వాడకం తగ్గించాలని, చిన్న యంత్రాల కొనుగోలుకు ప్రభుత్వం పూర్తి రాయితీలు ఇవ్వాలని రైతు వెంటేశ్వర్లు కోరుతున్నాడు. బ్రష్ కట్టర్ యంత్రం విజయవాడ, ఖమ్మం, నల్గొండ, మిర్యాలగూడ ప్రాంతాల్లో లభ్యమవుతుందని, ఆన్‌లైన్‌లో కూడా ఆర్డర్ చేసి తెప్పించుకోవచ్చని తెలిపాడు.

సమాజ మార్పు కోసం ఉపాధ్యాయులు పని చేయాలి

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నేటిసమాజంలో అందరికి సమానమైన, నాణ్యమైన విద్య అందడంలేదని, సమాజం అభివృద్ధి చెందుతున్నప్పటికీ విద్యా అవకాశాలు సమానంగా అందడంలేదని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

అధిక పింఛన్‌ను విడుదల చేయాలి

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులకు అధిక పింఛన్(హైయర్ పెన్షన్)ను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఖమ్మం రీజియన్ సెక్రటరీ ఎల్ఆర్‌కే రావు, ఆర్డీ శేషగిరిరావు డిమాండ్ చేశారు. రెండేళ్ల క్రితం సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా ప్రావిడెంట్ ఫండ్ సంస్థ 2014 సెప్టెంబరు తరువాత పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు హైయర్ ఆప్షన్‌కు డిమాండ్ లెటర్ తీసుకుని డబ్బులు చెల్లించుకున్నారని అన్నారు. వందలాది విశ్రాంత ఉద్యోగులు ఈ హైయర్ ఆప్షన్ పింఛన్‌కు ఆశపడి డబ్బులు చెల్లించిన తర్వాత పింఛన్‌ను మంజూరు చేయలేదని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో జరిగిన సంఘటనలకు రిటైర్డ్ ఉద్యోగులను బాధ్యులను చేయకుండా డీడీ ద్వారా చెల్లించిన వారికి ఇప్పటి వరకు అందించిన విధంగా హైయర్ పింఛన్‌ను విడుదల చేయాలని ప్రావిడెంట్ ఫండ్ సంస్థను వారు కోరారు.

వైద్య కళాశాలకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

88,862 చదరపు అడుగుల విస్తీర్ణంతో గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి నాలుగు అంతస్తులు నిర్మిస్తున్నారు. వీటిలో 141 గదులు నిర్మిస్తున్నారు. బాలుర హాస్టల్‌కు 62,841 చదరపు అడుగుల విస్తీర్ణంతో గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి మూడు అంతస్తులు నిర్మిస్తారు. వీటిలో 96గదులు కనీసం 247మంది ఉండే విధంగా నిర్మిస్తున్నారు. ప్రిన్సిపాల్ క్వార్టర్, గెస్ట్ హౌజ్ 12,349 చదరపు అడుగులతో గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి రెండు అంతస్తుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వంటగదులు గ్రౌండ్ ఫ్లోర్‌లో 7534 చదరపు అడుగుల్లో నిర్మించనున్నారు. అయితే తొలుత రూ.166 కోట్లు మంజూరు అయినప్పటికీ ప్రస్తుతం రూ.130కోట్లకు కుదించి హైదరాబాద్‌కు చెందిన కేఎంవీ ప్రాజెక్టు పనులను నిర్వహిస్తున్నారు.

ముమ్మరంగా పనులు

ఖమ్మం మెడికల్ కళాశాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రహదారులు భవనాలశాఖ ఆధ్వర్యంలో ఈ పనులు నిర్వహిస్తున్నారు. కళాశాల భవనానికి మూడు బ్లాకులకుగాను ఏ, బీ బ్లాకులకు పుట్టింగ్స్ వేశారు. 'బి' బ్లాకుకు సెల్లార్ ఫ్లోరింగ్ పనులు సాగుతున్నాయి.

బాలికల హాస్టల్ భవనానికి ఎక్స్‌కవేటర్ పనులతోపాటు పుట్టింగ్స్ పూర్తి చేశారు. యంత్రాలు, 150 కార్మికులతో పనులను చేయిస్తున్నారు. ఆర్ అండ్‌బీ ఇంజనీర్లు, కాంట్రాక్టరు కంపెనీ ప్రతినిధులు పనులను పర్యవేక్షిస్తున్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికి పనులను పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులను నిర్వహిస్తోన్నట్టు ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన

(5వ పేజీ తరువాయి)

ఒకే ప్లాట్‌ఫామ్‌పై ఉంటే వారి సమస్యలు తీరడమే కాక హక్కులు సాధించుకోగలుగుతారన్నారు. వేర్వేరు సంఘాల వల్ల మాలలకు గౌరవం తగ్గుతుందని సూచించారు. మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఎవరినీ విమర్శించేందుకు, వ్యక్తిగతంగా కించపరిచేందుకు కాదని, కేవలం మాలల ఆత్మగౌరవం కోసమే నిర్వహించారన్నారు. మాలలు తమ హక్కులు సాధించటానికి ఐక్యంగా పోరాడాన్నారు. పోరాటాలకు తాము సహకరిస్తామని అయితే మాలలందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. మాలలు చేసే పోరాటం ఎవరికీ వ్యతిరేకం కాదని, తమను అణగదొక్కేందుకు రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర పన్నే మనువాదులపైనే నన్నారు.

మాలమహనాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య మాట్లాడుతూ తాము న్యాయం కోసం పోరాడుతుంటే ఎంఆర్‌పీఎస్ పేరుతో మంద కృష్ణమాదిగ పబ్బం గడుపుకొనేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. వివిధ రకాల పేర్లతో సభలు నిర్వహిస్తూ మాలలపై దుష్ప్రచారం చేయడం విచారకరమన్నారు. వాస్తవంగా మాలలకు రావాల్సిన రిజర్వేషన్లు రాకపోవడంతో వారిలో అనేకమంది అర్హత ఉన్నప్పటికీ ఉద్యోగాలు సాధించలేకపోతున్నారన్నారు.

సమావేశానికి ముందు నయాబజార్ కాలేజీ నుంచి మమతారోడ్డులోని ఫంక్షన్‌హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సమితి కన్వీనర్ గుంతేటి వీరభద్రం, న్యాయవాది పల్లా రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో మాల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ డి.సర్వయ్య, సమతా సైనిక్ దళ్ దేశ ఉపాధ్యక్షుడు దిగంబర్ కాంబ్లే, టీమ్ రాష్ట్ర కార్యదర్శి మేకల రవీందర్, భీమ్ ఫౌండేషన్ అధ్యక్షుడు మందాల భాస్కర్, ప్రముఖగాయకుడు రెంజర్ల రాజేష్, డాక్టర్ గోపినాథ్, డాక్టర్ బాబురత్నాకర్, లింగాల రవికుమార్, పేరం మల్లయ్య, దామల్ల సత్యం, జంగం లక్ష్మణరావు, స్వర్ణకుమారి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

దేదీప్యమానం.. కార్తీక వైభవం...



(5వ పేజీ తరువాయి)

కార్తీక దామోదరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరి నదీ తీరంలో ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు.

అలాగే తమ ఆరాధ్య దైవమైన రామయ్యను కనులారా వీక్షించారు. ఆలయంలో స్వామిదర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలను వెలిగించారు. అలాగే రామాలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో సత్యనారాయణస్వామి వ్రతాల్లో 35మంది భక్తులు పాల్గొన్నారు.

భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో శివాలయ ప్రాంగణంలో జ్వాలాతోరణం, గోదావరి నదీ తీరంలో నదీ హారతి కార్యక్రమాలను అత్యంత సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

ఉందిలే మంచి కాలం..

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించింది. దీనిపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఇవ్వదలిచిన వారు 30 రోజుల్లోపు ఖమ్మం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (లాండ్ ఎక్విజిషన్)కు లిఖితపూర్వకంగా సమర్పించాలని వీటిపై డిప్యూటీ కలెక్టర్ విచారణ జరిపి నిర్ణయం వెలువరిస్తారని రైల్వేశాఖ పేర్కొంది. మండల రెవెన్యూశాఖ భూసేకరణకు అవసరమైన భూమి తాలుకూ సర్వే నెంబర్ల జాబితాను సిద్ధం చేసింది.

ఎర్రుపాలెంకు ప్రాచుర్యం

ఉత్తరాది రాష్ట్రాల్లోని పలు నగరాలను దక్షిణాది నగరాలకు అనుసంధానం చేసేందుకు ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు లైన్ అత్యంత కీలకం కానుంది. రాజధాని అమరావతి మీదుగా హైదరాబాదు, సికింద్రాబాదు టు ముంబయి, నాగ్‌పూర్ ఢిల్లీ వంటి నగరాలకు, దక్షిణాదిలో చెన్నైతో పాటు తమిళనాడు , కేరళ రాష్ట్రాల్లో పలు నగరాలకు రైళ్లు పరుగులుపెడతాయి. ప్రస్తుతం ఢిల్లీ, ముంబయి నుంచి చెన్నై వైపు వచ్చి వెళ్లే రైళ్లు...కాజీపేట వైపునుంచి విజయవాడ వచ్చి అక్కడి నుంచి హౌరా-చెన్నై మెయిన్ లైన్‌లో తెనాలి మీదుగా చెన్నైవైపు రాకపోకలు సాగిస్తున్నాయి.

అమరావతి లైన్ నిర్మాణం పూర్తయితే కాజీపేట నుంచి వచ్చే రైళ్లు ఎర్రుపాలెంవద్ద కొత్త లైన్‌లోకి వచ్చి అమరావతి మీదుగా నంబూరు చేరుకుంటాయి. అక్కడి నుంచి న్యూ గుంటూరు స్టేషన్ మీదుగా హౌరా-చెన్నై ప్రధాన లైన్‌లోని తెనాలి వద్ద కలిసి చెన్నై వైపు వెళతాయి. ప్రస్తుతం విజయవాడ మీదుగా నిత్యం సగటున 250 రైళ్ల రాకపోకలు సాగిస్తుండడంతో ఈ స్టేషన్‌పై తీవ్ర వత్తిడి ఉంది.



ఎర్రుపాలెం రైల్వే స్టేషన్

అమరావతి లైన్ అందుబాటులోకి వస్తే అనేక రైళ్లు ఎర్రుపాలెం మీదుగా మళ్లించేందుకు వీలుంటుంది. సరిహద్దు కావడంతో కాలక్రమేణా ఇరు రాష్ట్రాలకు ఎర్రుపాలెం జంక్షన్‌పాయింట్ కానుంది.

పెరగనున్న రవాణ, వ్యాపారం

నూతన రైల్వేలైన్ ప్రాజెక్టు నిర్మాణంతో భూములకు రెక్కలొచ్చే అవకాశం ఉంది. ఎర్రుపాలెం మండలంలోని రెవెన్యూభూములను ఇప్పటికే 20 నుంచి 30 శాతం ఆంధ్రా ప్రాంత వాసులే కొనుగోలు చేశారు. ఇది వచ్చే సంవత్సరానికి మరో 20 శాతం పెరిగే అవకాశం లేకపోలేదు. మండల కేంద్రానికి 6 కి.మీ. దూరంలో తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ఉంది. దీనికితోడు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చొరవతో అటవీశాఖ ఆధ్వర్యంలో పూర్తిస్థాయి పర్యాటక కేంద్రంగా ఎర్రుపాలెం మండదలం అభివృద్ధి కానున్న తరుణంలో రవాణా పెరిగితే ఈ క్షేత్రం, పరిసర గ్రామాలు కూడా అభివృద్ధిలోకి వస్తాయి.

గిరిజన యువత బిర్సాముండాను ఆదర్శంగా తీసుకోవాలి

- చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎమ్మెల్యేలు వెంకట్రావు, వెంకటేశ్వర్లు, ఆదినారాయణ

భద్రాచలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతోపాటు అభివృద్ధి కోసం గిరిజన యువత బిర్సాముండాను ఆదర్శంగా తీసుకొని అందుకోసం కంకణబద్ధులై కృషి చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ పేర్కొన్నారు. భద్రాచలంలో శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ బ్రిటీష్ వలసవాదంపై సాగిన భారతీయ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న యోధుడిగా బిర్సాముండాను గౌరవిస్తారన్నారు. నేటి గిరిజన యువత ఆదివాసీల అభివృద్ధి కోసం కంకణం కట్టాలని, సంస్కృతి సంప్రదాయాలను మర్చిపోకుండా వృద్ధిలోకి తేవాలన్నారు. ఆదివాసీ గిరిజనులకు జ్ఞాపకశక్తి, తెలివితేటలు అపారమని పేర్కొన్నారు. త్వరలో జిల్లాను పర్యాటక జిల్లాగా అభివృద్ధి చేస్తున్నామని, భద్రాచలం వచ్చే భక్తులు తప్పనిసరిగా పర్యాటక కేంద్రాలను సందర్శించి వెళ్లడానికి బెండలపాడు, తుమ్మల చెరువు, దామరతోగు అటుకులపాడు గ్రామాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు.

గిరిజనాభివృద్ధి కోసం అత్యధిక నిధులు కేటాయిస్తున్నాం

రాష్ట్రంలో గిరిజనాభివృద్ధికి అత్యధిక నిధులను కేటాయిస్తున్నామని జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గిరిజన తండాల్లో, గూడేల్లో పర్యటించడంతో పాటు గూడేల అభివృద్ధికి, ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్య, వైద్యం మన జాతిని, సంస్కృతిని, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను కాపాడుకొని ముందుకు పోవాలన్నారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలలు, 'మన ఊరు మన బడి' కింద



వెదురు ఉత్పత్తుల స్టాల్‌ను తిలకిస్తున్న కలెక్టర్

అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. మన హక్కుల కోసం మన్యం దొర అల్లూరి సీతారామరాజు, కొమరం భీం, బీఆర్‌షా ముండా వంటి మహనీయుల పోరాటం ఫలితంగానే 1/70 చట్టం, పీసా చట్టం అటవీ భూముల్లో పోడు కొట్టుకునే అవకాశం మనకు కలిగిందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేలు తెల్లం, పాయం, జారేలు జ్యోతి ప్రజ్వలన చేశారు. కాగా జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్ ఐటీడీఏ ముందు ఏర్పాటు చేసిన టేక్ ఏ ఫొటోలో ఫొటో దిగారు. అలాగే ఐటీడీఏ అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ జీఎం, ప్రత్యేక అధికారి శంకర్రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్, సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజ్, డీఆర్‌డీవో విద్యాచందన, డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఏవో రాంబాబు, ఏసీఎంవో రమణయ్య పాల్గొన్నారు.



రఘునాథపాలెంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కార్పొరేటర్ ఔదార్యం

- తెలంగాణ ఉద్యమకారుడికి త్రిచక్ర వాహనం

ఖమ్మం సంక్షేమవిభాగం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్మదినోత్సవం సందర్భంగా ఖమ్మం 50వ డివిజన్ కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్ సేవానిరతిని చాటుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఖమ్మం నగరానికి చెందిన దావా నాగేశ్వరరావు చురుగ్గా పాల్గొన్నాడు. అయితే ఇటీవల నాగేశ్వరరావు రోడ్డు ప్రమాదానికి గురికాగా, వైద్యకారణాల రీత్యా ఆయన కాళ్లను తొలగించారు. దీంతో బాధితుని కుటుంబం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ శరత్‌కుమార్ రూ.లక్షా30వేలతో త్రిచక్ర వాహనాన్ని ప్రత్యేకంగా తయారు చేయించారు. శుక్రవారం రాపర్తినగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ చేతుల మీదుగా త్రిచక్ర వాహనాన్ని నాగేశ్వరరావుకు అందించారు. ఈ సందర్భంగా మేయర్ నీరజ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్మదినోత్సవం సందర్భంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కమర్తపు మురళి, నాయకులు సూరపునేని బాబురావు, వల్లూరుపల్లి అజయ్, వీరయ్య, గంట భీమయ్య, పెరుమల్ల నరేశ్, వేల్పుల రామకృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.



స్వేదం లేని...సేద్యం

▸ మొక్కజొన్నకు తాత్కాలిక డ్రిప్ వినియోగిస్తున్న రైతులు

చింతకాని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగంలో నానాటికి పెరుగుతున్న అధునాతన సాంకేతికతను రైతులు పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నారు. మొక్కజొన్న పంటకు దుక్కిపై నిత్యం నీరు కట్టాల్సిన అవసరం లేకుండా పాత పద్ధతులకు స్వస్తి పలికి డ్రిప్ పద్ధతిని పాటిస్తున్నారు. మొక్కజొన్న విస్తారంగా పండించే చింతకాని మండల రైతులు తమ పొలాల్లో డ్రిప్ పద్ధతిని వినియోగించి మొక్కజొన్న సాగు చేస్తున్నారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటిని పొదుపుగా వాడటమే కాకుండా పంటకు ఉపయోగించి ఎరువులు కూడా కావాలిసిన మోతాదులో పంటకు అందించే అవకాశం ఉండటంతో రైతులు తాత్కాలిక డ్రిప్ పద్ధతిని వినియోగిస్తున్నారు.

అయ్యప్ప భక్తులకు ఆర్టీసీ బస్సులు





▸ అద్దెకు వాహనాలను ఇస్తున్న రోడ్డు రవాణా సంస్థ

▸ తక్కువ ఖర్చుతో ఎక్స్‌ప్రెస్, లగ్జరీ సర్వీసులు

ఖమ్మం ఖానాపురం హవేలి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం వచ్చిందంటే స్వామియే శరణమయ్యప్పా వాడవాడలా అయ్యప్ప శరణుఘోష వినిపిస్తుంది. ఖమ్మం జిల్లాలో సుమారు 10వేలకు మందికి పైగా స్వాములు మాలధారణ చేస్తుంటారు. అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములకు ఆర్టీసీ బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఖమ్మం రీజియన్ పరిధిలోని ఆరు డిపోల నుంచి శబరిమల యాత్రకు అద్దెకు బస్సులు ఇస్తున్నారు. శబరిమల యాత్ర దూరంతో కూడుకున్నది కావడంతో కండీషన్‌లో ఉన్న బస్సుతోపాటు, అనుభవజ్ఞులైన డ్రైవర్లను ఆర్టీసీ సిద్ధం చేసింది. ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, సత్తుపల్లి, మధిర, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు డిపోల నుంచి శబరికి బస్సులను బుక్ చేసుకునే సదుపాయం ఉంది. ప్రైవేటు ట్రావెల్స్ కంటే తక్కువ ధరలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు.

కిలోమీటరుకు రూ.59చొప్పున అద్దె..

శబరిమల యాత్రకు బస్సు అద్దెకు బుక్ చేసుకున్న వారికి అన్ని బస్సుల్లో గురుస్వామికి ఒక టికెట్ ఉచిత ప్రయాణం అందిస్తున్నారు. వీరితో పాటు వంట మాస్టర్‌కు, ఒక సహాయకుడికి బస్సులో ప్రయాణించేందుకు అవకాశం కల్పించారు. 36సీట్లు ఉండే సూపర్ లగ్జరీ బస్సులు, 40 సీట్లు ఉండే డీలక్స్ బస్సులు, 49 సీట్లు ఉండే ఎక్స్‌ప్రెస్ బస్సులను అద్దెకు ఇవ్వనున్నారు. డీలక్స్ లగ్జరీ బస్సులకు కిలోమీటరుకు రూ.59, ఎక్స్‌ప్రెస్ బస్సుకు కిలోమీటరుకు రూ.63 చొప్పున ఆర్టీసీ అధికారులు అద్దె వసూలు చేయనున్నారు. అయ్యప్పస్వాములు మార్గ మధ్యలో వంట చేసుకునేందుకు వీలుగా వంట సామగ్రిని కూడా తీసుకెళ్లే వెసులుబాటును కల్పించారు.

స్వాముల వెంట తెచ్చుకునే లగేజీకి ఎలాంటి అదనపు చార్జీ లేదు. ప్రయాణించే కిలోమీటర్ల ఆధారంగా కొంత అడ్వాన్స్ చెల్లించి బస్సులను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. టోల్‌గేట్, పార్కింగ్ చార్జీలు, పర్మిట్ చార్జీలు అద్దెకు తీసుకున్న వారే చెల్లించాలి. ఒక్కో బస్సుకు ఇద్దరు నిపుణులైన డ్రైవర్లను కేటాయించనున్నారు. ప్రైవేటు వాహనాలతో పోల్చితే ఆర్టీసీ అద్దె చాలా తక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు. బస్సులు అద్దెకు కావాలనుకునే వారు ఆయా డిపోల్లోని మేనేజర్లను సంప్రదించాల్సి ఉంటుంది.

తీర్థయాత్రలకు కూడా

శబరిమలైతో పాటు భక్తులు చూడాలనుకునే తీర్థయాత్రలకు కూడా బస్సులను అందుబాటులో ఉంచారు. సమూహంగా వచ్చే భక్తులు వారు వెళ్లాలనుకునే ప్రదేశాల వివరాలను, టూర్ సమయం, ఎన్నిర రోజులో చెపితే ఆర్టీసీ అధికారులు దానికి అనుగుణంగా బస్సులను ఎంగేజ్ చేస్తారు.

స్వాములు సద్వినియోగం చేసుకోవాలి

సరిరాం, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఖమ్మం.

ఆర్టీసీ శబరిమల యాత్ర భక్తుల కోసం బస్సులను అద్దెకు ఇస్తున్నాం. కావాల్సిన వారు డిపోలలో సంప్రదించాలి. కిలోమీటరు చొప్పున, వెయిటింగ్ సమయాన్ని లెక్కగట్టి తగిన ధర నిర్ణయిస్తాం. దీన్ని అయ్యప్ప స్వాములు సద్వినియోగం చేసుకోవాలి. ఆర్టీసీలో తక్కువ చార్జీతో సురక్షితంగా ప్రయాణించవచ్చు.



జిల్లా జనరల్ ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంవోగా రాంబాబు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంవోగా డాక్టర్ బి. రాంబాబును నియమించారు. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఎస్ ఆర్ఎంవోగా పని చేసిన కళావతి బాయి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా నియమితులవ్వడంతో ఈ పోస్టు ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా విధులు నిర్వర్తిస్తున్న రాంబాబుకు సీఎస్ ఆర్ఎంవోగా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు.

20న 'సంఘం శరణం గచ్ఛామి' నాటక ప్రదర్శన

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఈనెల 20వ తేదీన రాత్రి 7 గంటలకు సంఘం శరణం గచ్ఛామీ నాటకం ప్రదర్శించనున్నారు. అభ్యుదయ ఆర్ట్ అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జీవిత చరిత్రను వర్తమాన, భవిష్యత్ తరాలకు అందించాలన్న లక్ష్యంతో ఈ నాటకాన్ని నిర్మించారు. 2016 ఏప్రిల్ 14న అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా ఈనాటకాన్ని ప్రారంభించారు. ఇప్పటి వరకు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలలో 700లకు పైగా ప్రదర్శన లివ్వటం విశేషం. అంబేద్కర్ చిన్నతనుంచి రాజ్యాంగ రచన వరకు ఏవిధంగా అవమానాలను, అవహేళనలను ఎదుర్కొని ఆదర్శంగా నిలిచాడో చదువు అనే ఆయుధంతో విజేతగా మారాడో తదితర ఇతి వృత్తాలను ఉదహరిస్తూ నాటకం కొనసాగుతుంది.

ఉమ్మడి జిల్లా అభివృద్ధి ప్రదాత తుమ్మల

కార్పొరేటర్ పాలెపు విజయవెంకటరమణ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి నాలుగు దశాబ్దాలుగా నిర్విరామంగా కృషి చేసి అభివృద్ధి ప్రదాతగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేషంగా పనిచేశారని, అటువంటి మహానాయకులు జిల్లాలో జన్మించటం మరో ఐదు తరాలకు అదృష్టంగా మారిందని ఖమ్మం నగరం 44వ డివిజన్ కార్పొరేటర్ పాలెపు విజయవెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను 44వ డివిజన్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా జరిపారు. మదర్‌థెరిస్సా ఫౌండేషన్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్మదినోత్సవ కేక్‌ను కట్ చేసి అనాథలకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం 200 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే ఖమ్మం జిల్లాను అభివృద్ధిలో ముందంజలో ఉంచేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూ.లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేయించారని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణం చేయించి కరువు మండలాల్లో ఏడాదికి మూడు పంటలు పండించారని, ఇప్పుడు ఖమ్మం నియోజకవర్గంలో మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా సాగు,తాగునీటి సమస్యలు తీర్చేందుకు ముందడుగు వేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, మైనార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



అన్నదానం చేస్తున్న పాలెపు విజయవెంకటరమణ

ముగిసిన ఒంగోలు జాతి ఎడ్ల పోటీలు

నేలకొండపల్లి, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని నాలుగు రోజులుగా రాజేశ్వరపురంలో నిర్వహిస్తున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఒంగోలు జాతి ఎడ్ల పందాలు శుక్రవారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతిని ఏపీలోని బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన ఆతోటి ఒరీష్ చౌదరి ఎడ్ల జత గెలుచుకోగా రూ.40వేల నగదును అందజేశారు. ద్వితీయ బహుమతి హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబు ఎడ్ల జత గెలుచుకోగా బహుమతిగా రూ.30వేల నగదు ప్రదానం చేశారు. తృతీయ బహుమతి కృష్ణా జిల్లా కానూరుకు చెందిన దేవభక్తుని సుబ్బారావు ఎడ్ల జత గెలుచుకోగా బహుమతిగా రూ.20వేలను అందజేశారు. తొలుత దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎడ్ల పందాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవటం గొప్ప విషయమన్నారు. రానున్న రోజుల్లో కూడా ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు తన్నీరు కృష్ణమూర్తి, మాజీ అధ్యక్షుడు దండా ప్రవీణ్‌కుమార్, వెన్నపూసల సీతారాములు, జొన్నలగడ్డ రవికుమార్, దండా రంగయ్య, శాఖమూరి రమేష్, గండు సతీష్, ఇస్రావత్ బాలాజి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న దయాకర్‌రెడ్డి

ఆర్టీసీ సేవలు మరింత మెరుగు పడాలి

▸ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సేవలు మరింత మెరుగు పడేలా ఆర్టీసీ యాజమాన్యం కృషి చేయాలని, ప్రతి పల్లెకు బస్సు సౌకర్యం కల్పించి ప్రజల ప్రయాణ కష్టాలని తీర్చాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం డిపో నుంచి హైదారాబాద్ మియాపూర్‌కు నూతనంగా ఏర్పాటు చేసిన రాజధాని ఏసీ బస్సులు శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాలకు ఆర్టీసీ ప్రయాణ సేవలను అందించే పరిస్థితి లేదని, ఆదాయాన్ని పరిగణలోకి తీసుకొని బస్సులను రద్దు చేస్తే ప్రజలు ఇబ్బందులకు గురి అవుతారన్నారు. ప్రైవేటు బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాల నుంచి ప్రజల దృష్టి మళ్లించి మెరుగైన సేవలు అందించడం ద్వారా ఆర్టీసీ బలోపేతం చేయాలన్నారు. కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల నుంచి ఇతర నగరాలకు, పట్టణాలకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని అన్నారు. గతంలో రద్దు చేసిన హైదారాబాద్ సర్వీస్‌లను పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు. కొత్తగూడెం బస్టాండ్‌ను నూతన హంగులతో నిర్మించేందుకు సంబంధిత అధికారులకు, మంత్రులకు ప్రతిపాదనలను అందించామని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, డిపో మేనేజర్ దేవేందర్‌గౌడ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సునీత, కంట్రోలర్లు వై.నాగేశ్వరరావు, జాకబ్, వెంకటేశ్వర్లు, భాస్కర్ పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అశ్వారావుపేట రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు మధ్యలో జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని గుమ్మడివల్లి గ్రామానికి చెందిన యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గుమ్మడివల్లికి చెందిన మర్లపాటి వెంకన్నబాబు(20) అనే యువకుడు బతుకుదెరువు కోసం గుంటూరు వెళ్లాడు. దాదాపు ఏడాది కాలంగా అక్కడే పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం గ్రామంలో జరిగిన అయ్యప్ప పడిపూజా కార్యక్రమానికి వచ్చాడు. తిరిగి శుక్రవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై గుంటూరు బయలుదేరి వెళ్లాడు. మార్గమధ్యలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో వెంకన్నబాబు సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. మృతుడు అవివాహితుడు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

తిరుమలాయపాలెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో జరిగింది. పోలసుల కథనం ప్రకారం మండలంలోని ఏలువారిగూడెం గ్రామానికి చెందిన పోలెపొంగు లక్ష్మయ్య(49) కూలీగా జీవిస్తున్నాడు. మద్యానికి బానిసగా మారాడు. కుటుంబ సభ్యులు గురువారం మందలించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని బంధువుల ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జగదీష్ తెలిపారు.

గుండెపోటుతో కార్మికుడి కన్నుమూత

కొణిజర్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన పోతనబోయిన ముత్తయ్య(55) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. ముత్తయ్య గతంలో వీఆర్ఏగా సేవలందించాడు. వీఆర్ఏలను పదోన్నతిలో భాగంగా వివిధ శాఖలకు కేటాయించడంతో ముత్తయ్యను మిషన్ భగరథలో హెల్పర్‌గా చేశారు. విధులకు వెళ్తుతూ అకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో మృతి చెందాడు. ముత్తయ్య మృతి పట్ల తోటి కార్మికులు సంతాపం వ్యక్తం చేశారు.

ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు

ఇల్లెందు టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బంధువు అంత్యక్రియలకు వచ్చి ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సంఘటన శుక్రవారం ఇల్లెందు పట్టణంలో చోటుచేసుకుంది. సీపీఎం రాష్ట్ర నాయకురాలు మాచర్ల భారతి, మండల నాయకులు మన్నెం మోహన్‌రావుల తల్లి మన్నెం నాగరత్నమ్మ (75) అనారోగ్యంతో మృతి చెందింది. పట్టణంలోని చెరువుకట్ట ఏరియా లేక్ పార్కు పక్కనే దహన సంస్కారాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో చనిపోయిన నాగరత్నమ్మకు మరదళ్లు అయిన చెరువుపల్లి ఎల్లమ్మ, చెరువుపల్లి మహాలక్ష్మిలు రోడ్డు దాటే క్రమంలో అతివేగంగా వచ్చిన ద్విచక్రవాహనంపై వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎల్లమ్మ కాలు నుజ్జునుజ్జు కాగా మహాలక్ష్మికి పొత్తికడుపులో తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ, సీపీఎం నాయకులు క్షతగాత్రులను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బైక్, కార్ ఢీ.. వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం, కారు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో బైకిస్ట్ మృతిచెందిన సంఘటన శుక్రవారం సత్తుపల్లి పట్టణం ఎన్టీఆర్ నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రేజర్లకు చెందిన వెలిశాల రాజా (40) భార్య కావ్యతో కలిసి సత్తుపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళ్తున్నాడు. బైక్‌ను వేంసూరు వైపు నుంచి ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజాను 108లో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం విజయవాడకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు ప్రారంభించారు.



కళా ప్రతిభను వెలికితీయాలి

▸ ఎన్ఆర్ఐ ఖమ్మం కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు

▸ మధిరలో ఘనంగా మొదలైన బాలోత్సవ్

మధిర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కళాకారులను, కళలను యేటా మధిర ప్రాంత పౌరులు ప్రోత్సహించడం అభినందనీయమని ఎన్ఆర్ఐ ఖమ్మం కమిటీ ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసరావు అన్నారు. రామభక్త సీతయ్య కళాపరిషత్ ఆధ్వర్యంలో మధిరలో రెండురోజుల పాటు నిర్వహించనున్న జాతీయస్థాయి మధిర బాలోత్సవ్-2024 పోటీలు శుక్రవారం టూటౌన్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి కళ్యాణమండపంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పోటీలను ప్రారంభించి ప్రసంగించారు. జిల్లాలోనే నాటక రంగం మధిరలోనే కొనసాగుతుందని ఇక్కడ ప్రజలు కళారంగానికి చేదోడువాదోడుగా నిలుస్తున్నారని తెలిపారు. తన తండ్రి పేరుతో స్థాపించిన రామభక్త సీతయ్య కళాపరిషత్ పేరుతో యేటా జాతీయ స్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహించడం ద్వారా వారిలోని సృజనాత్మకతను వెలికి తీసున్నారని ప్రశంసించారు.

అలరించిన నృత్యప్రదర్శనలు

బాలోత్సవ్ పోటీలు తొలిరోజు రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలనుంచి తరలి వచ్చిన చిన్నారుల నృత్యప్రదర్శనలతో అలరించాయి. తొలిరోజు పోటీలలో 212మంది పాల్గొన్నారు. శాస్త్రీయ నృత్యప్రదర్శనలకు 90, జానపద నృత్య ప్రదర్శనలకు 92, గ్రూపు డాన్స్‌లకు 30గ్రూపులు పోటీపడి ప్రదర్శనలు ఇచ్చారు. ఉదయం 11గంటలకు ప్రారంభమైన పోటీలు రాత్రి వరకు కొనసాగాయి .

బాలోత్సవ్‌లో నేడు..

బాలోత్సవ్‌లో రెండోరోజు శనివారం నీసత్తా చాటుకో, నీతి పద్యాలు, ఏకపాత్రలు, దేశభక్తిగీతాలు, సందేశాత్మక ఉపన్యాసం, విచిత్ర వేషధారణ పోటీలు నిర్వహించనున్నారు. ఈకార్యక్రమంలో భరత్ విద్యాసంస్థల డైరెక్టర్ శీలం వెంకటరెడ్డి, నిర్వాహకులు మారోణిబాయి, సోనిబాయి, జాన్సీబాయి, ప్రసన్న, దినకర్, తదితరులు పాల్గొన్నారు.







పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

లారీతో వ్యక్తిని తొక్కించిన నిందితుల అరెస్టు

మధిరటౌన్,నవంబరు15: లారీతో ఓ వ్యక్తిని తొక్కించి హత్య చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు మధిర సీఐ డి. మధు శుక్రవారం తెలిపారు. ఈ నెల 12వ తేదీన మధిర రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణాపురం గ్రామం వద్ద కల్లూరు మండలం యర్రబోయనపల్లి గ్రామానికి చెందిన కొలికపోగు సోమయ్య(40) అనే వ్యక్తిని లారీతో తొక్కించి హత్య చేసిన కేసులో నిందితులైన విజయవాడకు చెందిన లారీ డ్రైవర్ రామిశెట్టి దుర్గారావు, నందిగామకు చెందిన క్లీనర్ పింగలి మల్లారెడ్డి హత్య చేసిన రోజున నిదానపురం క్రాస్ రోడ్డు వద్ద వదిలి వేసిన లారీని తీసుకునేందుకు శుక్రవారం వచ్చారు. సమాచారం రావడంతో రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు నాగ్‌పూర్ లో లారీలో కందిపప్పును లోడ్ చేసుకొని విజయవాడలో దిగుమతి చేసుకునేందుకు వస్తున్న క్రమంలో లారీ డ్రైవర్ సైడ్ కోసం హరన్ కొడుతుండటంతో మోటర్ సైకిల్ పైన ఉన్న హతుడు సోమయ్య డ్రైవర్ తో వాదనకు దిగాడు. ఈ క్రమంలో సోమయ్య తన మోటర్ సైకిల్‌ను లారీ కి అడ్డుగా పెట్టి డ్రైవర్, క్లీనర్ తో ఘర్షణ కు దిగాడు. ఈ క్రమంలో సోమయ్యను లారీతో తొక్కించి లారీని నిదానపురం క్రాస్ రోడ్డులో వదిలి వెళ్లారు. ప్రమాదంలో గాయపడిన సోమయ్య అక్కడికి అక్కడే మృతి చెందాడు. నిందితులను అరెస్టు చేసి శుక్రవారం కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్ఐ లక్ష్మీ భార్గవి పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మధు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టేకులపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తిచెందిన ఓవ్యక్తి పురుగుల మందు సేవించి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ సంఘటన మండలకేంద్రంలోని డబుల్‌బెడ్‌రూం కాలనీలో చోటుచేసుకుంది. టేకులపల్లి పోలీసుల కథనం ప్రకారం డబుల్‌బెడ్‌రూం కాలనీకి చెందిన గుగులోతు చందు(35) గత రెండేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తిచెందిన చందు గురువారం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో క్రిమిసంహాకర మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి మెరుగైన వైద్యంకోసం అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు టేకులపల్లి ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. కాగా మృతునికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉంది.

పార్కింగ్ వివాదం... పోలీసులకు ఫిర్యాదు

ఖమ్మం క్రైమ్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్‌లో పార్కింగ్ వివాదం జరగటంతో ఓ తహసీల్దార్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగరంలోని బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో ఓ తహసీల్దార్ అద్దెకు నివాసం ఉంటున్నారు. అతనికి పార్కింగ్ స్థలం లేకపోవడంతో మేనేజ్‌మెంట్ ఓ స్థలాన్ని కేటాయించారు. ఆ స్థలంలో కారును పార్కింగ్ చేయకుండా ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. అపార్ట్‌మెంట్ నివాసులందరికి ఇబ్బందులకు గురికావటంతో యాజమాన్యం సదరు తహసీల్దార్‌ను ఈ విషయమై అడిగారు. అయినా వినకుండా తనకు ఇష్టం వచ్చిన చోట కారును పార్కింగ్ చేస్తున్నారు. దీంతో వారు శుక్రవారం ఖమ్మం టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అపార్ట్‌మెంట్ వద్దకు వచ్చి ఇరువురితో మాట్లాడారు. అయినా తహసీల్దార్ వినకపోవటంతో పోలీసులు అక్కడి నుంచి వెనుతిరిగారు.



బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

తిరుమలాయపాలెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రధాన గ్రామం, 20గ్రామపంచాయతీలకు అనువుగా ఉన్న బచ్చోడును మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ సీపీఐఎంఎల్, మాస్‌లైన్, ప్రజాపంథా ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బచ్చోడను మండల కేంద్రంగా ప్రకటిస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారని, దీన్ని నిలబెట్టుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మిడి హనుమంతరావు, దారమళ్ల వెంకన్న, వెంకయ్య, రఘుబాబు, మల్లయ్య, నరసయ్య, ఉప్పయ్య భద్రమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	38 రూ.
వంకాయ	40
గుత్తి వంకాయ	44
బీరకాయ	48
పచ్చిమిర్చి	38
కాకరకాయ	28
బెండకాయ	20
పొట్లకాయ	40
దోసకాయ	28-68
చిక్కుడు	58
నాటుచిక్కుడు	120
గోరుచిక్కుడు	40
క్యాబేజీ	38
దొండ	30-40
సొరకాయ	20
క్యారెట్	78
క్యాప్సికం	68
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	175
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మట్కా
ఆదిత్య:	కంగువ
తిరుమల:	దేవర
సినీ గెలాక్సీ:	ధూంధాం

శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

కూసుమంచి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): కూసుమంచిలోని కాకతీయుల గణపేశ్వరాలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. తెల్లవారుజామున నాలుగు గంటలకే ఆలయానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేకపూజలు, కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు ఉసిరి చెట్టుకు పూజలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. లక్ష ఒత్తులను, 365 ఒత్తులను వెలిగించారు. పెద్దసంఖ్యలో మహిళలు దీపాలను వెలిగించడంతో ఆలయ ప్రాంగణం వెలుగులతో కార్తీకశోభ సంతరించుకుంది. ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో శివలింగాన్ని పూలతో అందంగా అలంకరించారు. కూసుమంచి మండలంలోని పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పూజలు చేశారు.

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయి, సుబ్లేడు, పాతర్లపాడు, బీరోలు, పిండిప్రోలు తదితర గ్రామాలల్లో శివాలయాలు వేకువజామునుంచే భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. పిండిప్రోలు సమీపంలోని వీరకాశీ పట్నం శివాలయంలో భక్తులు పూజలునిర్వహించారు.సుబ్లేడు శివాలయంలోజిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం. నరేష్‌రెడ్డి పూజలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో మరికంటి వీరభద్రస్వామి, సుగుణమ్మ, శంకర్ పాల్గొన్నారు.

ఖమ్మం సాంస్కృతికం: స్థానిక నిజాంపేటలో 42వ డివిజన్‌లోని శ్రీ పార్వతి సహిత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి ఘనంగా నిర్వహించారు. శివ నామస్మరణ చేస్తూ ఒత్తులు వెలిగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గుంటుమల్లేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



42వ డివిజన్‌లోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో..





ఎన్నెస్పీ ఆఫీస్‌రోడ్డు శివాలయంలో ఒత్తులు వెలిగిస్తున్న భక్తులు, శివయ్య దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు







గుంటు మల్లేశ్వరస్వామి ఆలయంలో హారతికి నమస్కరిస్తున్న భక్తులు,కూసుమంచి శివాలయంలో భక్తుల తాకిడి, వత్తులు వెలిగిస్తున్న భక్తులు

15న మాదిగల వన సమారాధన

ఖమ్మంరూరల్,నవంబరు15(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 15న నిర్వహించనున్న మాదిగల వనసంరాధన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మాదిగల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం రామ్‌లీల ఫంక్షన్‌హాల్లో కరపత్రాలు ఆవిష్కరించారు. కూసుమంచిలోని ఓ మామిడితోటలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి మండలాల మాదిగలు రాజకీయ పార్టీలకు అతీతంగా కదలి రావాలని పిలుపునిచ్చారు. ఉదయం 9గంటలకు వనసమారాధన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంరూరల్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుర్రాలపాడు, వరంగల్ క్రాస్‌రోడ్, కోదాడ క్రాస్‌రోడ్డు, మద్దులపల్లి, తెల్దారుపల్లి, తల్లంపాడు, పొన్నేకల్లు, నరసింహాపురం గ్రామాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రభాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్పందనకు కేయూ డాక్టరేట్



ఖమ్మంఖానాపురంహవేలి నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన సింగారపు స్పందనకు వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం నుంచి డాక్టరేట్ ప్రకటించారు. ఈ మేరకు పరీక్షల నియంత్రణాధికారి ఉత్తర్వులు జారీచేశారు. తెలుగు సాహిత్యంలో కథ, నవలా రచయిత డా.వి.చంద్రశేఖరరావు రచనలు అనుశీలన అనేఅంశంపై కేయూ తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ పంతంగి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పరిశోధనాసిద్ధాంత గ్రంథాన్ని సమర్పించనందుకు డాక్టరేట్ పట్టాపొందారు.

మొబైల్ వాహనం మూలకు!

- మూడునెలలుగా కలెక్టరేట్‌కే పరిమితం
- పట్టించుకోని అధికారులు

ఖమ్మంకలెక్టరేట్,నవంబరు15(ఆంధ్రజ్యోతి): జిల్లాకు మంజూరైన మొబైల్ ఐసీటీసీ వాహనం మూడు నెలలుగా మూలన ఉంటోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు వీటిని కేటాయించారు. కాగా జిల్లాలో మాత్రం ఆ వాహనం కలెక్టరేట్‌లోనే మూలుగుతోంది. జాతరలు, జనసందోహం, రద్దీకూడళ్లలో ఈ వాహనాన్ని నిలిపి అక్కడ ప్రజలకు అనుమానితులకు హెచ్‌ఐవీ పరీక్షలను నిర్వహించాల్సి ఉంటుంది. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేకంగా వాహనాన్ని సిద్ధం చేసి జిల్లాకు పంపించింది. ఈ వాహనంలో ల్యాబ్ టెక్నీషియన్, కౌన్సిలర్, డ్రైవర్, హెల్పర్ మొత్తం నలుగురు సిబ్బంది ఉండాల్సి ఉంటుంది. కానీ మూడు నెలలైనా ఆ పోస్టులను భర్తీ చేయలేదు. దీంతో ఈ వాహనం వినియోగంలోకి రావడం లేదు. ఫలితంగా లక్షలాదిరూపాయల విలువైన వాహనం నిరుపయోగంగా ఉండిపోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వాహనాన్ని అందుబాటులోకి తీసుకు రావాలని కోరుతున్నారు.



కలెక్టరేట్‌లో ఉన్న ఐసీటీసీ వాహనం

గిరిజన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాలి

- జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి విజయలక్ష్మి

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): గిరిజన సాంస్కృతిక వారసత్వం, జాతీయ గౌరవాన్ని పరిరక్షించి, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం ధర్తి ఆబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి నేపథ్యంలో గిరిజన గౌరవదినోత్సవ సమారోహము సందర్భంగా ఖమ్మం ఎన్నెస్పీ క్యాంపులోని గిరిజనభవన్‌లో వేడుకలను నిర్వహించారు. బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బిర్సా ముండా 19వ శతాబ్దానికి చెందిన ప్రముఖ ఆదివాసీ ప్రజానాయకుడని ఆయన నేతృత్వంలో ఉల్గులాన్ ఉద్యమం నడిచిందన్నారు. 1875లో జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో ఉలీహతు గ్రామంలో జన్మించారని తెలిపారు. బ్రిటిష్ పాలకుల అరాచకం వల్ల తన సమాజం ఎదుర్కొంటున్న దుస్థితి గురించి ఆలోచించి పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ గిరిజన సంక్షేమ అధికారులు జహీరుద్దీన్, సత్యవతి, సంఘం అధ్యక్షుడు భూక్యా వీరభద్రం, సంత్ సేవాలాల్ సేన రాష్ట్రఅధ్యక్షుడు బి.కిషన్ నాయక్, ఏసీఎంఓ రాములు, జీసీసీ మేనేజర్, గిరిజన సంఘాల నాయకులు మంగ్య నాయక్, బి.శోభన్ నాయక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బిర్సాను ఆదర్శంగా తీసుకోవాలి

నవోదయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

కూసుమంచి: బ్రిటిష్ పాలకుల అరాచకాలపై పోరాడిన బిర్సా ముండాను స్ఫూర్తిగా తీసుకోవాలని పాలేరు జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం విద్యాలయంలో బిర్సా ముండా 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు బిర్సా ముండాను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. 19శతాబ్దానికి చెందిన ఆదివాసీ నేతృత్వంలో గొప్ప ఉద్యమం నడిచిందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల పాల్గొన్నారు.





మాట్లాడుతున శ్రీనివాసులు, బిర్సా ముండా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విజయలక్ష్మి

పద్మశాలీల సంక్షేమానికి కృషి

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ పద్మశాలీ సంక్షేమసంఘం ద్వారా పద్మశాలీల సంక్షేమానికి కృషి చేస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, రాజకీయ భవిష్యత్ గురించి చర్చించారు. రాష్ట్ర పద్మశాలీ సంఘానికి గౌరవ సలహాదారులుగా ఎంపికైన డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్, గుంటి నగేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన గుడిమళ్ల సూర్యప్రకాశరావు, వెనగంటి గోవర్ధన్‌రావు, రాష్ట్ర మహిళ సంఘం అధ్యక్షురాలుగా ఎన్నికైన కొండ పద్మ, కార్యదర్శులు ఉదారి మాధవి, కొండ శ్రీనివాస్‌ను అభినందించారు. జిల్లాకు అత్యధిక ప్రాతినిధ్యం ఇచ్చారని, తమకు ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నెరవేరుస్తామన్నారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

ఘనంగా తుమ్మల జన్మదినోత్సవం





28వ డివిజన్లో సముద్రాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో మొక్క నాటుతున్న నాయకులు, ఉద్యోగులు

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలి

తిరుమలాయపాలెం, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ పంటను అమ్ముకుని మద్దతు ధర పొందాలని కూసుమంచి ఏడీఏ బిసరిత అన్నారు. శుక్రవారం మండలంలోని సుబ్లేడు, రఘునాథపాలెం, మహ్మదాపురం గ్రామాల్లో పర్యటించారు. వరి సాగుచేసే రైతులకు సలహాలు,సూచనలు అందించారు. మండలంలో 9కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ధాన్యం అక్కడే అమ్మాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సీతారామిరెడ్డి, ఏఈవో నవనీత పాల్గొన్నారు.

రేపు ప్రీమెచ్యూర్ డే మారథాన్

ఐఏపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్

ఖమ్మం, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): నవంబరు 17న ప్రపంచ ప్రీమెచ్యూర్ డే సందర్భంగా అంకుర ఆసుపత్రి, ఇండియన్ అకాడమీ పీడీయాట్రిషన్స్ (ఐఏపీ) సంయుక్తంగా 5కేవాక్ నిర్వహించనున్నట్లు ఐఏపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్ తెలిపారు. అంకుర ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ప్రీమెచ్యూర్ బేబీలకు సంబంధించి అవగాహన కల్పించడంలో భాగంగా ఆదివారం లకారం పార్కు నుంచి అంకుర ఆసుపత్రి వరకు వాక్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. నెలలు నిండకుండానే పుట్టిన పిల్లల్లో మెదడు, ఊపిరితిత్తులు, కళ్లు వంటి శరీర భాగాలు అభివృద్ధి చెందని కారణంగా పిల్లలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దానికి సరైన సమయంలో చికిత్స పొందడం ద్వారా వాటిని అధిగమించవచ్చన్నారు. గర్భవతిగా ఉన్న సమయంలో శిశువుకు సరైన న్యూట్రిషన్స్ అందకపోవడం, గర్భంలో ఉమ్మనీరు తక్కువగా ఉండటం వంటి కారణాలతో నెలలు నిండకుండానే శిశువులు జన్మిస్తున్నారన్నారు. దీనిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం కోసం మారథాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్ పాల్గొంటారనీ ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్లు జాకీర్, సింధు, అపర్ణ, జోత్స్న, కల్పన, సాయి ప్రసన్న పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కూరపాటి, డాక్టర్లు

కవిసమ్మేళనంలో పాల్గొన్న సునంద



ఖమ్మంసాంస్కృతికం, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన బాల సాహిత్య సమ్మేళనంలో ఖమ్మం నగరానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు పురిమళ్ల సునంద పాల్గొన్నారు. ఈ సమ్మేళనానికి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆమె ఒక్కరికే ఆహ్వానం అందటం విశేషం. హిందీ, ఇంగ్లీష్, తెలుగు భాషల్లో కవిత్వం చదివి ప్రశంసలందుకున్నారు.

ఐఎన్‌టీయూసీ నగర కమిటీ ఎన్నిక

ఖమ్మంసంక్షేమ విభాగం,నవంబరు15(ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ ఖమ్మం నగర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిమ్మశర్తి నాగేశ్వరరావును ఎన్నిక చేశారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు నియామకపత్రాన్ని అందించారు. ఆటో కార్మికసంఘంలో నాగేశ్వరరావు కీలకంగా పని చేస్తున్నారు. నాగేశ్వరరావును సంఘం నాయకులు నరాల నరేశ్, పాల్వంచ కృష్ణ అభినందించారు.



నాగేశ్వరరావు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



రఘునాథపాలెం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో రఘునాథపాలెం మండలానికి రూ.50 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధులు మంజూరు చేయించారని మాజీ ఎంపీటీసీ, జిల్లా కాంగ్రెస్ నాయకులు యర్రగర్ల హనుమంతరావు పేర్కొన్నారు. శుక్రవారం వేపకుంట్ల, చెర్వుకొమ్ముతండా, చింతగుర్తిలో 50మందికి ముఖ్యమంత్రి సహాయ చెక్కులను పంపిణీ చేశారు. ఒక్క రఘునాథపాలెం మండలానికి ఇటీవల కాలంలో బాధితులకు మొత్తం 101 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంత్రి తుమ్మల డబ్బులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. నాయకులు వాంకుడోత్ దీప్లానాయక్, మాలోత్ రామునాయక్, చల్లగుల్ల శ్రీనివాసరావు, బండి నాగేశ్వరరావు, మాజీ సర్పంచి ఎన్ రమేశ్, ప్రేమ్‌కుమార్, జంపా నాయక్ పాల్గొన్నారు.

నగరమంతా తొలగించారు.. కార్యాలయం ఎదుట ఉంచారు!

- కేఎంసీ ఎదుట ఏపుగా పెరిగిన కొనోకార్పస్ మొక్కలు
- తొలగించాలని డిమాండ్ చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు15 (ఆంధ్రజ్యోతి): ఊరంతటికి వైద్యుడే కానీ సొంతింటికి కాదన్న చందంగా ఉంది కేఎంసీ అధికారుల పనితీరు.. పర్యావరణానికి హానితో పాటుగా భూగర్భ జలాలను తాగేస్తున్నాయని, మనుషులకు శ్వాసకోశ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయనే కారణాలతో ఖమ్మం నగరంలోని 1లక్షకు పైగా కొనోకార్పస్ మొక్కలు, వృక్షాలను ఖమ్మం నగరపాలక సంస్థ అధికారులు ఇటీవల తొలగించారు. ఖమ్మం కొత్తబస్టాండ్‌లో మరో అడుగు ముందుకేసి బస్టాండ్‌లో తొలగించిన కొనోకార్పస్ చెట్లస్థానంలో పర్యావరణానికి అనుకూలమైన మొక్కలను కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య నాటించారు. కానీ ఇప్పుడు కేఎంసీ కార్యాలయం ఎదుట మొక్కల నుంచి వృక్షాలుగా మారిన కొనోకార్పస్ చెట్లపై చర్చ జరుగుతుంది. ఖమ్మం నగర వ్యాప్తంగా తొలగించిన కొనోకార్పస్ మొక్కలు.. ఖమ్మంనగర పాలక సంస్థ కార్యాలయం చుట్టూ ఏపుగా పెరుగుతున్నాయి. కేఎంసీలో పనిచేస్తున్న 1,040 మంది ఉద్యోగుల ఆరోగ్యంపై అధికారులకు శ్రద్ధలేదని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈవిషయంపై కేఎంసీ ఉద్యాన అధికారి బెల్లం రాధికాను వివరణ కోరగా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.



కేఎంసీ ఎదుట ఏపుగా పెరుగుతున్న కొనోకార్పస్ వృక్షాలు



మధిరలో 24న కమ్మ వన సమారాధన

మధిరటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మధిర మండల కమ్మ సోదరుల వన సమారాధన 24న నిర్వహించతల పెట్టినట్లు సంఘ నాయకులు తెలిపారు. శుక్రవారం మధిర లో వన సమారాధన కరపత్రాన్ని ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ కమ్మ వారిలో ఐక్యతను పెంచేందుకు కార్తీక మాసం లో ప్రతి సంవత్సరం వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కృష్ణాపురంలోని బొప్పన రామారావు మామిడితోట లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పుతుంబాక కృష్ణప్రసాద్, కరివేద వెంకటేశ్వరావు, మల్లాది వాసు, పారుపల్లి విజయ్, శ్రీనిధి అనిల్, బీవీఆర్, గద్దం రమేష్, నాగార్జున, బిక్కి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మధిరలో పత్తి కొనుగోలు

704 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసిన బయ్యర్



రైతులు తెచ్చిన పత్తి లోడును పరిశీలిస్తున్న ఏడీఏ విజయచంద్ర , ఏవో సాయి దీక్షిత్

మధిర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మధిరలో పత్తి కొనుగోలు ఎట్టకేలకు మొదలైంది. గత నెల 29న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిరలో పత్తి కొనుగోలును ప్రారంభించినా ఇంతవరకు రైతులనుంచి పత్తి కొనుగోలు జరగలేదు. పత్తిలో తేమశాతం ఎక్కువగా ఉందని నిబంధనల మేరకు తీసుకొస్తేనే కొనుగోలు చేస్తామని బయ్యర్ చెప్పడంతో ఇంతకాలం పత్తి కొనుగోలు జరగలేదు. పత్తికొనుగోలు చేయడం లేదని రైతులు, పలు పార్టీల నేతలు ఆందోళనలు చేసిన దరిమిలా బయ్యర్‌పై అధికారుల నుంచి వత్తిడి వచ్చింది. దీంతో గురువారం నుంచి కొనుగోలు మొదలైంది. ఇందుకు బయ్యర్ గ్రామాల్లోని రైతుల వద్దకు వెళ్లి పత్తిని స్వయంగా పరిశీలించి 12శాతంలోపు తేమ ఉన్న పత్తిని మాత్రమే తీసుకురావాలని అంత కన్నా ఎక్కువ ఉన్న పత్తిని ఆరబెట్టుకొని తీసుకొస్తే గిట్టుబాటుధర వస్తుందని తెలిపారు. దీంతో కనకదుర్గా జిన్నింగ్ మిల్‌లో పత్తిని కొనుగోలు చేయడంతో రైతులు తమ పత్తిని తీసుకొస్తున్నారు. గురువారం 704.40క్వింటాళ్ల కొనుగోలు చేశారు. అత్యధికంగా 12శాతం లోపు తేమగల పత్తి రావడంతో రూ.7220లు ధర పలికింది. కొంత పత్తి 11శాతం రావడంతో వారికి రూ.7295లు ధర వచ్చింది. అయితే ఇంకా కొంత మంది రైతులు 12శాతం కన్నా ఎక్కువ తేమ ఉన్న పత్తిని తీసుకురావడంతో వాటిని బయ్యర్ తిరస్కరించారు. 12శాతం తేమ వరకు ఆరబెట్టుకొని రావాలని సూచించారు. వాతావరణం మేఘావృతమై ఉండటంతోపాటు మార్కెట్‌కు సెలవులురావడంతో రైతులుమిల్లుకుతీసుకొచ్చిన పత్తిని తిరిగి వెనక్కి తీసుకెళ్లారు. అధికారికంగా ప్రారంభించిన మంజిత్ కాటన్ జిన్నింగ్ మిల్ వద్ద బయ్యర్ తమ మనషులను పెట్టినా రైతులెవరూ ఇంతవరకు పత్తి తీసుకురాలేదని తెలిపారు.

భక్తి శ్రద్ధలతో ఆలయాల్లో కార్తీక పూజలు

నెట్‌వర్క్: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా కార్తీక దీపోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో భక్త దంపతులకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అనతరం భక్తులు ఆలయ ఆవరణలో కార్తీక దీపాలను వెలిగించి దీపోత్సవంనిర్వహించారు. వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లో భక్తులు కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కారేపల్లి మండలం గేటు కారేపల్లిలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



వైరా శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



జమలాపురంలో కోనేరు వద్ద దీపాలంకరణ



కొణిజర్లలో కార్తీకపౌర్ణమి సందర్భంగా దీపాలను వెలిగిస్తున్న భక్తులు





మధిర చెరువులో అరచేతులలో దీపాలు వెలిగిస్తున్న వాసవీక్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, కొణిజర్ల మండలం తనికెళ్లలో..



ముదిగొండ దీపాలు వెలిగిస్తున్న భక్తులు



చింతకాని మండలం బస్వాపురంలో పూజలు



జమలాపురం ఆలయంలో జ్వాలా తోరణం నిర్వహిస్తున్న అర్చకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తుపల్లిరూరల్/కల్లూరు/ఏన్కూరు నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ నిమిత్తం శనివారం ఉదయం 8.30నుంచి 10.30వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ శరత్ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాభారతి రోడ్, అంబేద్కర్ నగర్, కల్పతరువు రోడ్, అవనీ వెంచర్, లలితకుమారి ఆసుపత్రి రోడ్, జూపల్లి ఆసుపత్రి రోడ్, మహాత్మాగాంధీ రోడ్, రామాలయం రోడ్, ఎన్టీఆర్ నగర్, జలగం నగర్, వాణీ విద్యాలయం రోడ్, కృషి రోడ్డు, విద్యానగర్ రోడ్డులలో అంతరాయం ఏర్పడనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కల్లూరు మండలంలో..

కల్లూరు (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని పెద్దకోరుకొండి గ్రామంలోని 33 /11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సబ్ స్టేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ శీల రామిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 నుంచి 10:30 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. దీంతో చెన్నూరు, యర్రబోయనపల్లి, చిన్నకోరుకొండి, మర్లపాడు, వెన్నవల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

జన్నారం సబ్‌స్టేషన్ పరిధిలో..

ఏన్కూరు(ఆంధ్రజ్యోతి): జన్నారం విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9గటలనుంచి 11గటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఏఈ ఉమాకాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జన్నారం 33/11కేవీ పరిధిలోజన్నారం నూకాలంపాడు, శ్రీరామగిరి, ఆరికాయలపాడు, లచ్చగూడెం, కోనాయపాలెం, రాజీవ్‌నగర్ కాలనీల గ్రామాలు అంతరాయం ఉంటుందని తెలిపారు.

వంద పడకల ఆసుపత్రిని వెంటనే ప్రారంభించాలి

» మధిర ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట సీపీఎం నిరసన

మధిరటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వంద పడకల ఆసుపత్రిని వెంటనే ప్రారంభించాలని కోరుతూ సీపీఎం నాయకులు శుక్రవారం మధిర ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తి అయి నాలుగు నెలలు కావస్తున్న ప్రారంభించడానికి నోచుకోలేదని, ఉప ముఖ్యమంత్రి స్థానిక ఎమ్మెల్యే భట్టికి జార్ఖండ్, ఢిల్లీ, మహారాష్ట్ర వెళ్లటానికి సమయం ఉంది కాని ఆసుపత్రి ప్రారంభానికి సమయం లేదా అని ప్రశ్నించారు. అధికారులు వెంటనే ప్రారంభించిక పోతే తామే ప్రజలతో కలిసి ప్రారంభిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాపినేని రాంనర్సయ్య, శీలం నరసింహరావు, పడకంటి మురళి, తేలప్రోలు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడి రోజే అంతిమ సంస్కారాలు

» గుండెపోటుతో అయ్యప్ప మాలదారుడి మృతి » నివాళులర్పించిన ప్రముఖులు



సాంబశివారెడ్డి (ఫైల్)

కల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) కల్లూరులో అయ్యప్పస్వామి మాల ధరించిన ఎస్ఎస్ రెడ్డి ప్రింటింగ్ ప్రెస్ యాజమాని గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. ఇరుముడి జరగాల్సిన శుక్రవారం రోజే అయ్యప్ప దీక్షపరుడైన శేగిరెడ్డి సాంబశివారెడ్డి (55) బుధవారం ఇంట్లో నిద్రిస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావటంతో మృతిచెందాడు. అయ్యప్పదీక్ష చేపట్టిన సాంబశివరెడ్డి ఇరుముడి పూర్తి చేసుకోని తోటి భక్తులతో యాత్రకు సన్నాహాలు చేసుకొని సిద్ధమై అయ్యప్ప సన్నిధానానికి వెళ్లే క్రమంలో ఈ సంఘటన జరిగింది. సాంబశివరెడ్డికి భార్య వెంకటనరసమ్మ, కుతూరు శిరీషా, కుమారుడు శివరెడ్డి ఉన్నారు. కాగా కుమారుడు శివరెడ్డి కెనడాలో, కుమార్తె ఢిల్లీలో ఉన్నారు. వారు వచ్చే వరకు సాంబశివరెడ్డి పార్థీవదేహాన్ని ఖమ్మంలోని మమత ఆసుపత్రిలోని మార్చురిలో భద్రపరిచారు. వారి పిల్లలు శుక్రవారం కల్లూరుకు రావడంతో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహిం చారు. 40 సంత్సరాలుగా కల్లూరులో ఎస్ఎస్ రెడ్డి ప్రింటింగ్ ప్రెస్‌ను నిర్వహిస్తున్నారు.

ప్రముఖుల సంతాపం

సాంబశివరెడ్డి మృతదేహంపై పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, ప్రతిభ విద్యాసంస్థల అధినేత లక్కినేని ప్రసాద్, వైద్యులు పి రాధకృష్ణమూర్తి, జి సోమలింగారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు లక్కినేని రఘు, వ్యాపార ప్రముఖులు చారుగుండ్ల అచ్యుతరావు, గుర్రం శ్రీనువాసరావు, మాజీ సర్పంచు రావి సూర్యానారయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అర్హులకు పథకాలు

» సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి » లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సత్తుపల్లిరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఇచ్చిన 6 గ్యారంటీలలో 5హామీలను అమలు చేసిన ఏకైక ప్రభుత్వం మన రేవంత్‌రెడ్డి సర్కార్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలో సత్తుపల్లి మండలానికి చెందిన 27మందికి రూ.8.46లక్షలు, వేంసూరు మండలానికి చెందిన 21మంది రూ.5.88లక్షలు, పెనుబల్లి మండలానికి చెందిన 24మందికి రూ.6.60లక్షలు వెరసి రూ.20.95లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను క్యాంప్ కార్యాలయంలో 72 మంది లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచడం, మహాలక్ష్మీ పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలీండర్, 200యూనిట్ల ఉచిత గృహ విద్యుత్‌ను అందించే గృహజ్యోతి పథకం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

ప్రభుత్వం హామీలను అమలు చేయాలి: సీపీఎం

కల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కల్లూరులోని పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశం తిగుళ్ల బాబు అధ్యక్షతన నిర్వహించారు. రమేష్ ప్రసంగిస్తూ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ, రైతు భరోసా రెండు పంటలకు ఇవ్వాలని కోరారు. రైతులు పండించిన అన్ని రకాల ధాన్యాన్ని బోనస్ ఇవ్వాలని అన్నారు. రుణమాఫీ కాని రైతులకు తక్షణం రుణమాఫీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచటంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. హామీలను అమలు కాని పక్షంలో ప్రజా ఉద్యమం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తన్నీరు కృష్ణార్జునరావు, శీలం సత్యానాయణరెడ్డి, ముదిగొండ అంజయ్య, కృష్ణవేణి, డి పుల్లయ్య, ఎస్ వీరభద్రం, గంపల శ్రీనివాస్, పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట

మధిరటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణ సర్కిల్ విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం మండల పరిధిలోని ఆత్కూరు గ్రామంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ శాఖ మధిర పట్టణ అసిస్టెంట్ ఇంజనీరు అనిల్ కుమార్ మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్లు బిగించు కోవాలని, ఆటోమేటిక్ స్టాటర్లు తీసివేయాలని ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు విద్యుత్, శాఖ సిబ్బంది పాల్గొన్నారు

తెలంగాణలో తెలుగుదేశం పార్టీదే భవిష్యత్తు

పార్టీ జిల్లా కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న డాక్టర్ వాసిరెడ్డి రామనాథం

వైరా, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీదే భవిష్యత్ అని ఆ పార్టీ ఖమ్మం జిల్లా కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల టీడీపీ కార్యాలయంలో పార్టీ వైరా నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నియోజకవర్గ కన్వీనర్ చెరుకూరి చలపతిరావు అధ్యక్షతన జరిగింది. టీడీపీ సభ్యత్వ నమోదు, పార్టీ విస్తరణ, రాబోయే రోజుల్లో పార్టీ అనుసరించాల్సిన విధానాలపై ప్రధానంగా చర్చించారు. డాక్టర్ రామనాథ్ం మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. భవిష్యత్‌లో తెలంగాణలో టీడీపీ, ఎన్డీయే భాగస్వామ్యతో కలిసి అధికారంలోకి రావడనాకి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకుడు కనగాల సాంభశివరావు, వైరా, పాలేరు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు చెరుకూరి చలపతిరావు, కొండబాల కరుణాకర్, జిల్లా నాయకుడు కేతినేని హరీష్, ఏన్కూరు మాజీ ఎంపీపీ ఆరెం వరలక్ష్మి, వైరా, కొణిజర్ల మండలాల అధ్యక్షులు కిలారు సురేందర్, తాతా సుధాకర్, నాయకులు ఆరెం రామయ్య, రాచబంటి కృష్ణయ్య, చావా రాణి, మందడపు మధుసూదన్‌రావు, మోత్కూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి: ఎంపీడీవో



మాట్లాడుతున్న ఎంపీడీవో సురేందర్

కారేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు చట్టాలపై అవగాహన ఉండాలని ఎంపీడీవో సురేందర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని 8 పంచాయతీలలో ధర్తి అలా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని జరుపుకున్నారు. ప్రత్యేక సమావేశాలలో పెసా చట్టం, ఫారెస్ట్ రైట్ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సమావేశాలకు ఆయా గ్రామపంచాయతీలకు సంబందించిన ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీవో రవీంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

పట్టు పట్టారు.. కొలువు సాధించారు..

తల్లాడ, వైరా, కల్లూరు మండలాల్లో గ్రూప్ 4 ఉద్యోగాలు సాధించిన యువత



ఉపేందర్



షేక్. అర్షాద్



రామకోటారెడ్డి



రాంగోపాల్



సంధ్యరాణి



షేక్.నాగూల్‌మీరా



సైదులు

తల్లాడ/వైరా నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే యువకుల పట్టుదల ఫలించింది. గ్రూప్-4 ద్వారా ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు సాధించారు. ఏడాదిలో మూడో ఉద్యోగానికి యువకుడు ఎంపికై ప్రతిభను చాటుకున్నాడు. గ్రూప్-4 ఉద్యోగాలకు తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన కటికి ఉపేందర్, షేక్.అర్షాద్, నారాయణపురం గ్రామానికి చెందిన రెడ్డెం రామకోటారెడ్డి ఎంపికయ్యారు. ఉపేందర్ వైద్య విధాన పరిషత్, అర్షాద్ సవిల్‌సప్లయి, రామకోటారెడ్డి ట్రెజరరీ శాఖలకు ఎంపికయ్యారు.

ఏడాదిలో మూడో ఉద్యోగం...

మల్లవరానికి చెందిన సన్నకారు రైతు కటికి గోపాలరావు, నాగసరోజిని దంపతుల కుమారుడు ఉపేందర్ డిగ్రీ, టీసీసీ పూర్తి చేశాడు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఈ ఏడాది జనవరిలో రైల్వేశాఖలో గ్రూప్-డీ, మే నెలలో ఎక్సైజ్ కానిస్టేబుల్, ప్రస్తుతం గ్రూపు-4 ఉద్యోగాలు సాధించాడు.

అన్నదమ్ములంతా ప్రభుత్వ ఉద్యోగులే

మల్లవరం గ్రామానికి చెందిన షేక్.ఫకీర్ అహ్మద్, కులుసుండీ దంపతుల రెండో కుమారుడు అర్షాద్ పీజీ పూర్తి చేశాడు. వీరు ముగ్గురు అన్నదమ్ములు. ఇప్పటికే అర్షాద్ అన్న ఇర్షాద్ పోలీస్ కానిస్టేబుల్, తమ్ముడు ఖలీద్ డీసీసీబీ బ్యాంకులో స్టాఫ్ అసిస్టెంట్ ఉద్యోగాలు చేస్తున్నారు. అర్షాద్ కూడా గ్రూప్-4 ద్వారా ఉద్యోగం సంపాదించడంతో ముగ్గురు అన్నదమ్ములను ప్రభుత్వ ఉద్యోగాలు వరించినట్లయింది.

తొలి ప్రయత్నంలోనే..

నారాయణపురానికి చెందిన రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, పద్మావతి దంపతుల కుమారుడు రామకోటారెడ్డి బీటెక్ పూర్తి చేశాడు. మెరుగైన వేతనంతో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగ అవకాశం వచ్చినప్పటికీ వదిలేసి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో రామకోటారెడ్డి తొలి ప్రయత్నంలో గ్రూప్-4 ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

వైరా మండలం నుంచి ముగ్గురు

వైరా (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెబ్బవరం, సిరిపురం గ్రామాల్లో ముగ్గురు గ్రూప్-4 ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సిరిపురం(కేజీ) గ్రామానికి చెందిన షేక్.నాగూల్‌మీరా జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. రెబ్బవరంలో బత్తుల రాంగోపాల్, బండి సంధ్యరాణి వార్డు ఆఫీసర్లుగా ఉద్యోగాలు సాధించారు. వీరిని ఆయా గ్రామస్థులు అభినందించారు.

గ్రూప్-4 కొలువు సాధించిన పోలీస్

కల్లూరు (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన రెడ్డి సైదులు టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన గ్రూపు- 4 ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన సైదులు ప్రస్తుతం కొత్తగూడెంలో ఆరు సంత్సరాల క్రితం నుంచి పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సామాన్య రైతు కుటుంబానికి చెందిన సైదులు బీ ఫార్మసీ పూర్తి చేసి 2006లో పోలీసు కొలువు సాధించట మే కాక తాజాగా గ్రూపు- 4 సాధింటంతో పలువురు అభినందించారు. ఈ మండలం నుంచి ఇప్పటికే అనేక మంది ప్రభుత్వ కొలువులు సాధించారు.

ఘనంగా మంత్రి తుమ్మల జన్మదిన వేడుకలు





మంత్రి తుమ్మల పుట్టిన రోజు సందర్భంగా కార్మికులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి, వైరాలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్





కొణిజర్లలో కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు సూరంపల్లి రామారావు, కల్లూరులో కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, చందర్‌రావు